# ప్యాచ్.. అంతా తూచ్!

- సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు హామీ హుళక్కే..
- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరి పనులు
- నియోజకవర్గంలో అధ్వానంగా 80 శాతం రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు



పూర్తిగా శిథిలమైన రామభద్రపురం-బొబ్బిలి రోడ్డు

**రామభద్రపురం:** సంక్రాంతి పండగ నాటికి గుంతలతో కనిపిస్తున్న రోడ్లు అద్దంలా మెరిసేలా చేసి చూపిస్తానని సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలాయి. చాలాచోట్ల రోడ్ల మరమ్మతు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నాయి. ఫలితంగా దారి పొడవునా గుంతలు, రాళ్లు తేలిన రోడ్లు కనిపిస్తున్నాయి. అధ్వానంగా తయారైన రోడ్లు మీదుగా ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ పోయి నెల రోజులు కావస్తున్నా రోడ్లు బాగు చేయలేదని విమర్శిస్తున్నారు. ఇంకేముంది ఎన్నికల హామీల్లాగే రోడ్లు వేస్తామన్న హామీ కూడా నెరవేర్చరని మండిపడుతున్నారు.

### 70 శాతం రోడ్లు దెబ్బతిన్నాయి..

బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాల్లో 70 శాతం రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి. వీటిలో కొద్దో గొప్పో వాటికి మరమ్మతులు చేశారు తప్ప మిగిలినవి అలానే ఉన్నాయి. పండగకు ఊరొచ్చిన వారంతా ఛీ ఇవేం రోడ్లు అని అసహనం వ్యక్తం చేసిన ఘటనలు కోకొల్లలు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు ఇచ్చిన హామీలు ఇంకా నెరవేర్చలేదా అని అంతా అనుకున్నారు.

### మంజూరు కాని నిధులు..

బొబ్బిలి నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి. రామభద్రపురం మండలంలో రామభద్రపురం నుంచి బొబ్బిలి, అలాగే రామభద్రపురం నుంచి బాడంగి, తెర్లాం మండలంలో తెర్లాం నుంచి బొబ్బిలి, బాడంగి మండలంలో పినపెంకి నుంచి ఆకులకట్ట, బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో మరికొన్ని రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రాళ్లు తేలిన రోడ్లు, తెగిపడిన రహదారులు, గుంతలతో నిండిన రోడ్లే ఎక్కడ చూసినా కనిపిస్తాయి. అయితే వాటి నిర్మాణం కోసం నిధులకై ప్రతిపాదనలు పంపించినా ఇప్పటికీ నిధులు మంజూరు కాకపోవడం గమనార్హం. కొన్నిరోజుల క్రితం పదుల సంఖ్యలో రోడ్లు బాగులేకపోగా తుపాను వర్షాలకు ఇప్పుడు వందల సంఖ్యలో రోడ్లు దెబ్బతిని పాడయ్యాయి. రోడ్లు స్వయంగా చూస్తున్నా పాలకులు, అధికారులకు ఇవేం పట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



రామభద్రపురం నుంచి బాడంగి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలా..



అధ్వానంగా రామభద్రపురం నుంచి సోంపురం వెళ్లే రోడ్డు

### సగమే మరమ్మతులు..

రామభద్రపురం, బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాల్లో రూ.166.7లక్షల వ్యయంతో 34.605 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు చేపడుతున్నారు. అయితే వీటిలో కొన్ని రోడ్లే సగం వరకు మాత్రమే మరమ్మతులు అయినట్లు అధికారిక సమాచారం. 2 కిలోమీటర్ల మేర రోడ్లు ఇంకా మరమ్మతులకు నోచుకోలేదు. అలాగే నియోజకవర్గంలోని జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు 164.25 కోట్లతో 47.037 కిలోమీటర్లు మేర బాగు చేస్తుండగా, వీటిలో 29.137 కిలోమీటర్ల పనులు జరిగాయి. ఇంకా 17.9 కిలోమీటర్ల రోడ్లు పనులు మిగిలి ఉన్నాయి. ఇప్పటికే పూర్తిచేసిన స్టేట్ హైవే, జిల్లా పరిధిలోని రోడ్లకు అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేసినా కాంట్రాక్టర్ల ఖాతాల్లో నగదు జమ కాలేదు.

### ప్రతిపాదనలు పంపాం..



రామభద్రపురం నుంచి బొబ్బిలి, తెర్లాం నుంచి బొబ్బిలి, రామభద్రపురం నుంచి బాడంగి వెళ్లే స్టేట్ హైవేలకు నాలుగు సార్లు ప్రతిపాదనలు పంపించాం. అయినా నిధులు మంజూరు కాలేదు. నిధులు కేటాయించి, ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

–ప్రణయ, ఆర్అండ్‌బీ ఏఈఈ, బొబ్బిలి

### అదుపు తప్పితే ప్రమాదమే..

మండలంలోని రామభద్రపురం-రాజాం వెళ్లే రహదారితో పాటు రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్లే రహదారి శిథిలమై అధ్వానంగా తయారయ్యాయి. ఇలాంటి రోడ్లపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పితే ప్రమాదమేనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమని కొంచెం వేగంగా వెళ్తే ఆస్పత్రిపాలవ్వాల్సిందేనని అంటున్నారు.

## తాగుదామంటే గుక్కెడు నీళ్లు లేవు..



బొబ్బిలి మండలం, పక్కి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, రోగి బంధువులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆస్పత్రికి వచ్చే వారి తాగునీటి సౌకర్యార్థం ఓ తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేసింది. అయితే అది ఇప్పుడు నిరుపయోగంగా మారింది. కనీసం ఇక్కడి ట్యాంకుకు ట్యాప్(కుళాయి) కూడా అమర్చక పోవడం.. సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. పీహెచ్‌సీకి వస్తూ వెళ్తుండే వారంతా తాగుదామంటే గుక్కెడు నీళ్లు లేవని, దాహం కూడా తీర్చలేరా అని ప్రభుత్వాన్ని పరోక్షంగా విమర్శిస్తున్నారు.

–బొబ్బిలిరూరల్

## అసలే ఇరుకు.. ఆపై భారీ వాహనాలు..





అసలే ఇరుకు రోడ్డంటే.. అదే రోడ్డులో భారీ వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ముందుకు కదలాలంటే గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. ఇదీ అంతర్‌రాష్ట్ర కూడలిగా పేరొందిన రామభద్రపురం గ్రామ మధ్య గుండా వెళ్లే ప్రధాన రోడ్డు పరిస్థితి. ఇదే దారిలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాలు, సాలూరు పట్టణం నుంచి అధిక లోడు, పొడవాటి వాహనాలు తరచూ వస్తూ వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇరుకు రోడ్డు కావడంతో ట్రాఫిక్ అంతరాయం తొలగించే పని పోలీసులకు కూడా కష్టతరమవుతోంది. బైపాస్ రోడ్డు మీదుగా భారీ వాహనాలు తరలించాలని, గ్రామం మధ్యలోని రోడ్డు గుండా వాటిని రానీయొద్దని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

–రామభద్రపురం

## పొలాల్లో ధాన్యం.. రైతు కళ్లలో దైన్యం..



ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాత ఆపసోపాలు పడుతున్నాడు. బస్తాల కొద్దీ ధాన్యం పట్టుకుని ప్రభుత్వం ఎప్పుడు కొనుగోళ్లు చేస్తాదా అని ఎదురుచూస్తున్నాడు. ఇన్నాళ్లు అపరాల పంటలకు నష్టం కలగకూడదని ఖరీఫ్ వరి నూర్పిడి చేయలేదు. కోసిన పంటను కుప్పలుగా వేసి పొలాల్లోనే ఉంచేశారు. ప్రస్తుతం అపరాలు చేతికి వచ్చినాక నూర్పిడి చేసి, ధాన్యం సిద్ధం చేశారు. అయితే వాటిని కొనే నాథుడు ఇప్పుడు కరువయ్యాడు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం చివరికి చేతులెత్తేసింది. టార్గెట్ పూర్తయిందని కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి. తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమంది నష్టానికి దళారీలకు ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తోంది.. సంతకవిటి మండలంలోని మందరాడ-చింతలపేట గ్రామాల మధ్య పంటపొలాల్లో సిద్ధం చేసిన ధాన్య బస్తాలు.

–రాజాం

## ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం



వంగర మండలం, కొత్తమరువాడ దగ్గరలోని విద్యుత్‌స్తంభం ప్రమాదకరంగా కనిపిస్తోంది. కొండచెరువును ఆనుకుని ఓ వైపు వంగి ఉన్న స్తంభం ఎప్పుడు పడిపోయి ఏం ప్రమాదం జరుగుతుందోనని అటువైపుగా వెళ్తున్న వారంతా భయందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, ప్రమాదం జరగకముందే స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

–వంగర

## పన్నులు తీసుకుంటారు.. నీరివ్వరా..?



తాగునీరు సక్రమంగా అందివ్వకపోవడంపై రాజాం పట్టణంలోని మారుతీనగర్ మూడో లైన్ మహిళలు ఆదివారం నిరసనకు దిగారు. అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారని, తామంతా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు బాగానే వసూలు చేస్తారే.. సరిపడ నీరు మాత్రం ఇవ్వలేరా అని నిలదీశారు. ఇదే విషయమై మున్సిపల్ ఏఈ వెంకట్ వద్ద ప్రస్తావించగా పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామన్నారు.

–రాజాం సిటీ

## క్లుప్తంగా

### వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి సంబరాలు



పందిరిలో కట్టిన అరటిగెలలు

**రాజాం:** మండలంలోని నరసింహపురంలో లక్ష్మీనరసింహస్వామి, రాములు వారి సంబరాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రెండేళ్లకోసారి చేసే ఈ సంబరాలు ఎంతో వేడుకగా జరుపుకుంటామని గ్రామస్తులు చెబుతున్నారు. సంబరాల్లో భాగంగా దేవుడి ఇంటి వద్ద పందిరి వేసి అరటిగెలలు వేలాడదీసి పందిరిపాట కార్యక్రమం చేపట్టారు.

**ముగిసిన రాములోరి సంబరాలు**

**రాజాం సిటీ:** పట్టణ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాములు వారి సంబరాలు ఆదివారంతో ముగిశాయి. గార కుటుంబీకుల కులదైవమైన రాముని ప్రతిమను ఊరేగించారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ల ప్రదర్శన, పందిరిపాట ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

### నేత్ర శస్త్రచికిత్సకు 35 మంది ఎంపిక

**రాజాం సిటీ:** స్థానిక కంచర వీధిలోని సత్యసేవా మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వైద్యులు శిబిరానికి హాజరై, రోగుల కళ్లను తనిఖీ చేసి, వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 35 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మందిర కన్వీనర్ కె.బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

### పుస్తక పఠనంతో అపార జ్ఞానం



రామభద్రపురం గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవాణి

**తెర్లాం/రామభద్రపురం/బాడంగి:** మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయాలకు హాజరైన విద్యార్థులకు పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయా గ్రంథాలయాల నిర్వాహకులు వివరించారు. పుస్తకాలు చదివితే అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఖాళీ సమయాల్లో విజ్ఞానం పంచే పుస్తకాలు చదవాలని కోరారు. అలాగే గ్రంథాలయాల్లోని చిల్డ్రన్స్ క్లబ్‌ల్లో విద్యార్థులు సభ్యులుగా చేరాలన్నారు.


### బోరు బాగుచేయండి ప్లీజ్!



పాడైన తాగునీటి బోరు

**వంగర:** మండలంలోని కె.కొత్తవలస గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. బోరు పాడైన కారణంగా తాగునీరు, వాడుక నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి, బోరు బాగు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### బొమ్మినాయుడువలసలో కొట్లాట







ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

**రాజాం సిటీ:** మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. భూ వివాదమే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది. అయితే ఈ దాడిలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన కె.ఈశ్వరరావు, బి.గొల్లబాబు, పి.పాపారావు, కె.చిన్నారావులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిపై అవతలి వర్గానికి చెందిన వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మరీ దాడికి పాల్పడినట్లు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వంజరాపు విజయ్‌కుమార్ తెలిపారు. ఈ దుర్ఘటనలో అధికార పార్టీ సానుభూతిపరుల ప్రమేయం ఉందని బాధితులు వాపోయారు. ప్రస్తుతం క్షతగాత్రులను రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఇదే ఘటనపై రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

## పరామర్శ



అప్పలనాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

**తెర్లాం:** వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ ప్రతినిధి బోను అప్పలనాయుడును పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అప్పలనాయుడు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పలనాయుడును కలిసి పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు



బాడంగి హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గోవిందరావు

**బాడంగి:** శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

మండలంలోని వాడాడ, రేజేరు, పాల్తేరు, కోడూరు, బాడంగి, గొల్లాది గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో విద్యార్థులకు తరగతులు జరుగుతుండగా, సబ్జెక్టు టీచర్లు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. పరీక్షల ఒత్తిడి లేకుండా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రేగిడి: జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**తెర్లాం:** ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని వెలుగు ఏపీఎం టి.రాము అన్నారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి, పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెనింగ్‌పై పలు సూచనలు చేశారు.

### జీవామృతం తయారీపై అవగాహన..

**రేగిడి:** మండలంలోని చాటాయవలస గ్రామంలో జీవామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ రమాదేవి మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, కూరగాయల పంటలకు పట్టే చీడపీడల నివారణకు జీవామృతం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం జీవామృతం తయారీని వివరించారు. ఎకరానికి జీవామృతం పిచికారీ చేయాలంటే ఆవుపేడ 5 కిలోలు, పశువుల మూత్రం 5 లీటర్లు, ఇంగువ ద్రావణం 200 గ్రాములను ఐదు లీటర్ల నీటిలో కలిపి ఒక తొట్టిలో నాలుగు రోజుల పాటు నిల్వ చేయాలి. ఉదయం, సాయంత్రం దానిని కర్రతో సవ్యదిశలో కలపాలి. ఈ మిశ్రమానికి 150 గ్రాముల సున్నం కలపాలి. ఆ తర్వాత 200 గ్రాముల ఇంగువ, రెండు లీటర్ల నీటిలో బాగా మరగబెట్టి దానిలో ముద్ద ఇంగువ వేసి చక్కగా కలిపి చల్లారిన తర్వాత ఇంగువ ద్రావణాన్ని పేడ మూత్రం ద్రావణంలో కలపాలి. ఈ ద్రావణాన్ని గుడ్డలో వడకట్టాలి. ఈ విధంగా తయారైన ద్రావణానికి 200 లీటర్ల నీటిని కలిపి పొలానికి పిచికారీ చేయాలి.

### మోక్షప్రదాయిని భగవద్గీత

**రేగిడి:** మోక్షప్రదాయిని భగవద్గీత అని, ప్రతిఒక్కరూ భగవద్గీత చదివితీరాలని ఆధ్యాత్మిక వక్తలు రామ్మోహనరావు, దామోదరరావులు అన్నారు. మండలంలోని దేవుదల గ్రామంలో గీతాశ్రమంలో భగవద్గీత పఠనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భగవద్గీత చదివినా, వినినా మనసు ప్రశాంతంగా ఉంటుందని, భగవద్గీత సారాంశం ప్రకారం జీవిస్తే మోక్షం పొందవచ్చన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

### హనుమాన్ చాలీసా పారాయణం

**రేగిడి:** స్థానిక విశ్వసాయి మందిరంలో 108 మంది భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం చేశారు. జిల్లా బాలవికాస్ ఇన్‌చార్జి అరుణకుమారి, రాజాం డివిజనల్ యూత్ కో-ఆర్డినేటర్ రాజు, రేగిడి భజన మండలి కన్వీనర్ శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు, బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులు ప్రారంభించండి

**తెర్లాం:** మండలంలోని చీకటిపేటలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని వేతనదారులు కోరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గతకొన్ని నెలలుగా పనులు జరుగుతున్నాయని, ఇక్కడ మాత్రం ఇంతవరకు పనులు ప్రారంభించలేదని అంటున్నారు. ఉపాధి పనులు జరగకపోవడంతో వేతనదారులమంతా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా పనులు ప్రారంభించేలా అధికారులు చూడాలని కోరుతున్నారు.

### ఘనంగా చర్చి వార్షికోత్సవం

**బాడంగి:** మండలంలోని డొంకినివలస ఏసు క్రీస్తు ప్రార్థనా మందిరం(చర్చి) 22వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో ఉదయం దివ్యబలిపూజ జరగ్గా గ్రామస్తులతో పాటు గొల్లాది, పాలవలస, పాడినవలస గ్రామాల విశ్వాసకులు పూజలో పాల్గొని, జీసస్‌ను ఆరాధించారు. ఫాదర్ డేవిడ్ క్రీస్తు సందేశాన్ని చదివి వినిపించారు. ఏసుప్రభువు బోధనలు అనుసరించి, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.

## పారిశుధ్య పనులు

**రాజాం:** పట్టణంలోని మారుతీనగర్, డోలపేట, సారధి రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్.. ఆయా ప్రాంతాల్లోని పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. జేసీబీ సాయంతో తొలగించిన ముళ్లపొదలు, చెత్తాచెదారం, కాలువల్లో నుంచి తీసి వేసిన మురుగు శివారు ప్రాంతానికి తరలించారు.



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్